క్లుప్తంగా

వర్షాల కోసం గంగమ్మతల్లికి పొంగళ్లు



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామ ప్రజలు గత మూడు రోజులుగా వర్షాల కోసం గ్రామ దేవతామూర్తులకు జలాభిషేకాలు, పూజలు చేస్తూ చివరి రోజు ఆదివారం గ్రామ శివారులో కొండూరు రోడ్డులోని గంగమ్మతల్లికి ఘనంగా పొంగళ్లు పెట్టుకున్నారు. పొంగళ్ల కార్యక్రమంలో మహిళలు, భక్తులు, రైతులు అశేషంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమ్యూనిటీ కల్యాణ మండపానికి శంకుస్థాపన



సత్తెనపల్లి: మండలంలోని వెన్నాదేవి సమీపంలోని వావిలాల నగర్‌లో రూ.1.32 కోట్లతో నిర్మించనున్న కమ్యూనిటీ కల్యాణ మండపానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం రెబ్కో బ్యాంకు వారు 61 మంది ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం ఉచితంగా కుట్టుమిషన్లు అందించగా, వాటిని మహిళలకు ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, పి.సుధీర్, టి.అంబిక తదితరులు ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి కొలుపులు




నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల అడ్డరోడ్డులోని పోలేరమ్మతల్లి అమ్మవారి ఆలయంలో వార్షిక కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి వార్షిక కొలుపులలో భాగంగా గ్రామంలోని భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామ శివారున గల ఆలయం వద్దకు చేరుకున్న మహిళా భక్తులు పొంగళ్లు పొంగించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. అమ్మస్వామి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల వితరణ చేశారు.

చల్లగుండ్లలో ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ



నకరికల్లు: బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఎన్టీ రామారావు చిరస్థాయిగా నిలిచిపోయారని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో ఎన్టీ రామారావు విగ్రహాలు రెండింటిని ఆదివారం ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీ రామారావుకు దక్కిందన్నారు. సినీ రంగంలో యుగపురుషునిగా, పేద ప్రజలు, బలహీన వర్గాల కోసం సంక్షేమ పథకాలు అందించిన రాజకీయ వేత్తగా ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జె.హరీష్, మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, సాగి శ్రీనివాసరావు, అలీ బాషా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు



పిడుగురాళ్లరూరల్: సకాలంలో వర్షాలు పడాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని గ్రామదేవతలకు జలాభిషేకం ఆదివారం నిర్వహించారు. మండలంలోని చెన్నాయిపాలెంలో పోలేరమ్మకు, పోతురాజుకు, మహాలక్ష్మమ్మకు, బొడ్రాయి అయిన గ్రామ దేవతలకు గ్రామస్తులంతా కలిసి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురిపించాలని వరుణదేవుడిని వేడుకున్నారు. దైవ నామ స్మరణతో ఊరు మోతమోగిపోయింది. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో

- చిన్నపాటి వర్షం, గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేత
- గణపవరం సబ్‌స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్యతో కాలిపోతున్న గృహోపకరణాలు
- అరకొరగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు



రాజుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్

రాజుపాలెం: చిన్నపాటి వర్షం.. గాలులు వస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మరలా ఇవ్వడానికి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. అదే విధంగా గ్రామాలలో చిన్న పాటి విద్యుత్ సమస్య వస్తే రోజుకు నాలుగైదుసార్లు కరెంట్ కట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులను చిన్నచూపు చూడడమే గాక వ్యవసాయ కనెక్షన్‌లను త్వరగా ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.. కొన్ని గ్రామాలలో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు..ఇది.. మండలంలోని గ్రామాలలో పరిస్థితి. గ్రామాలలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

మండలంలో మూడు సబ్ స్టేషన్‌లు

మండలంలోని గణపవరం, రాజుపాలెం, అనుపాలెంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. గణపవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని ఆయా గ్రామస్తులు మొర పెట్టుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో ఆయా గ్రామాలకు సంబంధించిన గ్రేడ్–2 జేఎల్ఎంలకు తెలియకుండనే ఎల్‌సీలు తీసుకుంటూ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. జేఎల్ఎంలను వినియోగదారులు అడిగితే మాకు తెలియకుండనే సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్‌లు ఎల్‌సీలు ఇస్తున్నట్లు జేఎల్ఎంలు చెబుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మండల కేంద్రమైన రాజుపాలెంలో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు ఉండడం వలన పగటి పూట విద్యుత్ కట్ చేయడంతో కంప్యూటర్‌లు దెబ్బతింటున్నాయని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఇది మండలంలోని విద్యుత్ సరఫరా పరిస్థితి. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని దాదాపు18 గ్రామాలలోనూ విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు.

రాత్రి వేళల్లో పవర్ కట్

రాత్రి వేళల్లో చిన్నపాటి జల్లు పడితే చాలు గంటల తరబడి విద్యుత్ కట్ చేస్తున్నారు. దీని వలన ప్రజలు దోమల బెడద తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు లేక ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

కాలిపోతున్న గృహోపకరణాలు

గణపవరం సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 9 గ్రామాలు ఉన్నాయి. ఈ 9 గ్రామాలలో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. లో ఓల్టేజీ సమస్యల వలన ఇళ్లలోని ఫ్యాన్‌లు, బల్బులు, టీవీలతో పాటు పలు గృహోపకరణాలు కాలిపోతున్నాయని వినియోగాదులు వాపోతున్నారు. విద్యుత్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

వ్యవసాయ కనెక్షన్‌లు నిల్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయానికి విద్యుత కనెక్షన్‌లు ఇవ్వడం లేదు. అరకొరగా ఒకటి, రెండు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్‌లలో కూటమి ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తుందని, ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగలు దొంగిలిస్తే మరలా ట్రాన్స్‌ఫార్మర్ కొరకు నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. రిపేర్లు వచ్చినా నెలలు పడుతుందని రైతులు అంటున్నారు.

చర్యలు చేపట్టాలి



తరుచూ విద్యుత్ పోవడం వలన గృహోపకరణాలు దెబ్బతింటున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ హెచ్చుతగ్గులు రావడంతో ఫ్యాన్‌లు, టీవీలు కాలిపోతున్నాయి. అధికారులు స్పందించి లో ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి.

– వేల్పుల లక్ష్మయ్య, ఉప్పలపాడు

సమస్యలు లేకుండా చూస్తాం

ఎప్పుడో బిగించిన పాత వైర్లు కావడం వలన చిన్న పాటి వర్షాలకు, ఈదురు గాలులకు వైర్లు తెగుతున్నాయి. వాటి వలన కొంత అంతరాయం ఏర్పడుతుంది. సాంకేతిక కారణాల వలన విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ సమస్య రావచ్చు, లో ఓల్టేజీ సమస్య లేకుండా చూస్తాం. ట్రాన్స్‌ఫార్మర్లను కూడా సకాలంలో బిగిస్తాం. సాధ్యమైనంత వరకు సమస్యలను త్వరగా పరిష్కరిస్తాను.

– కోటా పెదమస్తాన్‌రావు, ఏఈ, రాజుపాలెం

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



అచ్చంపేట: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆదివారం అచ్చంపేటలో పంపిణీ చేశారు. భగవద్గీత ప్రాముఖ్యతను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరం తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో కులమతాల మధ్య అసమానతలు తొలగించబడతాయని వివరించారు. సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనన్న సత్యాన్ని తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు కటకం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను ఎం.వీరయ్య, టి.రాఘవ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. శావల్యాపురం ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ.1,54,800లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దమ్మాలపాడులో ఉచిత వైద్య శిబిరం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జెడ్పీ హైస్కూల్‌లో సత్తెనపల్లికి చెందిన సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్లు సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు చెందిన గుండె వైద్య నిపుణులు ఆకుల శివప్రసాద్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు ఎంఎల్‌వీ సాయ కృష్ణారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. మొత్తం 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వైద్య సిబ్బందిని సత్కరించారు.



వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

రోడ్ల పక్కనే చెత్త

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంకు నోచుకోని దొడ్లేరు పంచాయతీ

దొడ్లేరు(క్రోసూరు): పంచాయతీలే చెత్తను సేకరించి వాటి ద్వారా వేస్ట్ మేనేజిమెంట్ ప్రక్రియ ద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని ప్రతి గాంధీ జయంతి రోజున ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించడమే గానీ వాస్తవానికి మండలంలోని దొడ్లేరు గ్రామ పంచాయతీ అందుకు విరుద్ధంగా ఉందని చెప్పవచ్చు. దొడ్లేరు గ్రామంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు గృహాల నుంచి సేకరించే చెత్త చెదారం, వ్యాపార సంస్థల నుంచి వచ్చే చెత్త చెదారాలు గ్రామ శివారులో రోడ్ల పక్కన పడ వేస్తున్నారు. దీంతో అటుగా ప్రయాణించే ప్రజలు, ప్రయాణికులకు దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాక చెత్త చెదారాల్లో తడి, పొడి, కుళ్లిన పదార్థాలు ఉండటంతో పందులు, కుక్కలు చేరి మరింత రోత చేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఇదే మాదిరిగా చెరువు వద్ద (పెరికపాడు రోడ్డులో), అదే విధంగా హోసన్న మందిరం రోడ్డుపై క్రోసూరు రోడ్డుపై పంచాయతీ వారు చెత్తను పడవేస్తున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



క్రోసూరు రోడ్డు పక్కన వేసిన చెత్త



దొడ్లేరు హోసన్న మందిరం వద్ద పడవేసిన చెత్త

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు లేదు



దొడ్లేరు పంచాయతీకి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు లేకపోవటంతో రోడ్ల పక్కన చెత్తను వేయాల్సి వస్తుంది. వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు కొరకు ఖాళీ స్థలం ఇప్పటి వరకు దొరకలేదు. ప్రభుత్వ పోరంబోకు స్థలాల కొరకు రెవెన్యూ శాఖకు అర్జీ పెట్టాం. అదేవిధంగా దాతలు ఎవరైనా సుమారు ఐదు సెంట్ల స్థలం ఇచ్చినా వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు ఏర్పాటు చేసేందుకు కుదురుతుంది. గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు తప్పనిసరి. వీలైనంత త్వరగా షెడ్డుకు స్థలం కొరకు పరిశీలిస్తాం.

– వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి, దొడ్లేరు

చదరంగంతో మెదడుకు పదును..

మాచర్ల రూరల్: చదరంగం మెదడుకు పదునుపెడుతుందని, దీని ద్వారా పనితీరు మెరుగుపర్చుకోవచ్చునని పల్నాడు చెస్ అకాడమీ అధ్యక్షుడు కె.కిరణ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పల్నాడు జిల్లా అండర్–13 ఓపెన్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చదరంగం క్రీడ వలన విద్యార్థులలో చురుకుదనాన్ని పెంపొందించటమే కాకుండా మానసిక ఒత్తిడులను ఉపశమనం పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు తమకు నచ్చిన విభాగాల్లో ఆటలు, పాటలు క్రీడలు వంటి పోటీలో పాల్గొనటం ద్వారా వారనుకున్న గోల్ సాధించగలరని చెప్పారు. యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆవుల వీరాంజనేయులు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పల్నాడు చెస్ అకాడమి స్థాపించి వందలాది మంది విద్యార్థులకు చదరంగం క్రీడలను నేర్పిస్తూ రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు బహుమతులు అందేలా తర్ఫీదు ఇస్తున్న కోచ్ కిరణ్ సేవలు అమూల్యమన్నారు. అనంతరం బాలురు, బాలికల విభాగాలలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కేఎస్ మోజెస్, కేజే మేగ్నెస్, బి.మేఘ శ్రీ, కోమలి, ఎం.శ్రావ్యకు బహుమతులు అందించారు. గెలుపొందిన నలుగురు ఆగస్టు 2,3, తేదీలలో మచిలీపట్నంలో జరిగే అండర్–13 రాష్ట్ర స్థాయిలో పోటీలలో జిల్లా నుంచి ప్రాధాన్యం వహిస్తారని కోచ్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సంబరాసు వేణు, బి.పాపారావు పాల్గొన్నారు.



చదరంగం పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో కోచ్ కిరణ్, ఆంజనేయులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో ఐలాండ్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె శిబిరం ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... దశల వారీగా అనేక ఆందోళనలు చేసి, వినతి పత్రాలు అందజేసినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఈ రోజు పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను రోడ్డు మీద నెట్టిందని ఆయన విమర్శించారు. వెంటనే ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రిటైర్మెంట్ 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, నిబంధనలు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమస్యల పరిష్కారించాలని సమ్మె కాలుపు డిమాండ్ల అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు వేముల శ్రీనివాసరావు, మధు, పవన్‌కుమార్, రమేష్, వాసా ప్రతాప్, కాండ్రగుంట రాజు, గోవిందు పాల్గొన్నారు.



ఐలాండ్ సెంటర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కాకాని జెడ్పీ ‘ట్రిపుల్’ ధమాకా !

- పాఠశాల నుంచి స్కౌట్స్ విభాగంలో ముగ్గురికి ట్రిపుల్ ఐటీ సీట్లు
- మొత్తం 8 మందికి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు



రావెల విగ్నేష్



బుట్టి ప్రభాస్



కొర్నెపాటి అనిల్‌కుమార్

నరసరావుపేట రూరల్: కాకాని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ పాఠశాల నుంచి మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించగా.. వీరిలో ముగ్గురు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో సీట్లు సాధించడం విశేషం. స్కౌట్స్ విభాగంలో ఒకే పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం రాష్ట్రంలో ఇదే ప్రథమం. తొలి విడత కౌన్సెలింగ్‌లో ఐదుగురు విద్యార్థులు పదిలో వచ్చిన మార్కులు ఆధారంగా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. స్కౌట్స్ విభాగంలో ఆదివారం విడుదల చేసిన జాబితాలో పాఠశాలకు చెందిన రావెళ్ల విగ్నేష్(ఒంగోలు ట్రిపుల్ ఐటీ), బుట్టి ప్రభాస్, కొర్నెపాటి అనిల్‌కుమార్ (నూజివీడు ట్రిపుల్ ఐటీ)ల్లో సీట్లు సాధించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కౌట్స్ విభాగంలో సీట్లు సాధిస్తున్నారు. గత ఏడాది రెండు సీట్లు, 2022–23లో ఒక సీటును ఈ విభాగంలో సీట్లు పాఠశాల విద్యార్థులకు దక్కాయి. హైస్కూల్ స్కౌట్ ఉపాధ్యాయుడు టి.అంజిరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన్‌తో పాటు రాజ్య పురస్కారంను విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. దీంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కుతున్నాయి. ఈ ఏడాది ఒకే పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందడం రికార్డుగా ఉపాధ్యాయులు తెలిపారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



పిడుగురాళ్ల: 18 సంవత్సరాల లోపు వారికి పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్కూల్, గుడి వంటి ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులను అమ్మరాదని సూచించారు. విద్యాలయాల చుట్టూ వంద గజాల వరకు పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని సూచించారు. అమ్మినవారికి రూ.200 అపరాధ రుసుం విధించటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మోహన్, శివనాగరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని శ్రీ కనక దుర్గమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాగరమాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. దీంతో శని, ఆదివారాల్లో భక్తుల సందడి బాగా పెరిగింది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తుల మొక్కుబడులు కోలాహలంగా సాగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి ముందు దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నరసరావుపేట: స్థానిక వినుకొండ రోడ్‌లోని రోటరీ కమ్యూనిటీ హాలులో నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా గవర్నర్ నామినీ ఎం.హరిహరప్రసాద్ అసిస్టెంట్ గవర్నర్ పి.రాఘవయ్య పూర్వ కార్యవర్గ ప్రెసిడెంట్ కపిలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ సాతులూరి శివకుమార్, గవర్నర్లు కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీం మొహిద్దీన్, సెక్రటరీ భవనం పునీందర్‌రెడ్డి, ట్రెజరర్ కట్టమూరి ఆంజనేయులు, డైరెక్టర్లు షేక్ జిలాని మాలిక్, పి.శివనాగరాజు, సీహెచ్ నాగలక్ష్మి సునీత, జమ్ముల రాధాకృష్ణ, వేమా వెంకటేశ్వరరావు, పోటు అచ్యుత్, పాశం కృష్ణారావు, పులిపాటి రమేష్, లింగ ఆంజనేయులుచే ప్రమాణస్వీకారం చేయించారు. పాస్ట్ ప్రెసిడెంట్ మేళ్లచెరువు వీరాంజనేయులు, చేకూరి సాంబశివరావు, రాయల శ్రీనివాసరావు, మామిడి సుబ్బారావు, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజ్ సెక్రటరీ షేక్ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

యడ్లపాడు: జాతీయ రహదారిపై డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు దెబ్బతినగా, డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారని ఎస్ఐ శివరామకృష్ణ వెల్లడించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ఒంగోలు వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్, జాతీయ రహదారి పక్కన తన వాహనాన్ని ఆపి నిద్రపోయాడు. అదేమార్గంలో వస్తున్న మరో ఇసుక లోడు లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనంపై నియంత్రణ కోల్పోయి, ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు లారీలు దెబ్బతిన్నాయి. అయితే డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

సున్నం మిల్లు కార్మికుల కూలి రేట్లు పెంచాలి

పిడుగురాళ్ల: సున్నం మిల్లు కార్మికులకు కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సున్నం బట్టీ కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ముగిసే సమయం దగ్గర పడుతుండగా సున్నపు బట్టీ కార్మికులతో సమావేశం నిర్వహించటం జరిగిందని చెప్పారు. పెరిగిన నిత్యావసరాలను అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు పెంపుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ గ్రాడ్యుటీ సర్వీస్ వంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, మహిళలకు మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల అధ్యక్షులు జె. జయరాజ్, వర్కర్స్ యూనియన్‌నాయకులు యతీరాజుల శివయ్య, చిట్టిబోయిన గిరిబాబు, గురవయ్య, కాకర్ల సాంబయ్య, రామారావు, బత్తుల కొండలు, నల్ల మేకల యలమంద, వెంకటేశ్వర్లు, దేవరంపాడు శ్రీను, రాంబాబు, పండిటి నాగరాజు, వెంకయ్య పాల్గొన్నారు.